నులిపురుగును నులిమేద్దాం

- జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం
- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


కాళ్లలో చిన్నారికి నులిపురుగు నివారణ మాత్ర వేస్తున్న వైద్య సిబ్బంది


భీమవరంలో విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. పొట్టి శ్రీరాములు మునిసిపల్ (పీఎస్ఎమ్) గరల్స్ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎండీఎం జిల్లా కోఆర్డినేటర్ కృష్ణారావు ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకోకపోవడం, కలుషిత ఆహార పదార్థాలు తినడం వంటి చర్యల వల్ల నులిపురుగులు వ్యాప్తి చెందుతాయని, తద్వారా తద్వారా కడుపు నొప్పి, రక్తహీనత, ఆకలి మందగించడం వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నరేష్, హెచ్ఎం జె.సుధారాణి, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. దుర్గాపురం మునిసిపల్ పాఠశాలలో డాక్టర్ ఎస్ లీనాసుప్రియ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎన్నార్ కళాశాలలో ఎస్ఎస్ఎస్, యుబీఏ, రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ప్రిన్సిపాల్ బీఎస్ శాంతకుమారి, కళాశాల పీవో పి రామకృష్ణంరాజు, ఎ.కృష్ణమోహన్, ఎల్.అనిల్‌దేవ్, ఇ భరత్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 92.69 శాతం పంపిణీ

వీరవాసరం : జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమాన్ని మంగళవారం మండల వ్యాప్తంగా నిర్వహించారు. ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దాం అనే నినాదంతో 2 ఏళ్ల వయస్సు నుంచి 19 ఏళ్ల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వీరవాసరం మండలం పీహెచ్‌సీ పరిధిలో 8,407 పిల్లలకు గాను 7,792 మంది పిల్లలకు ఈ మాత్రలు పంపిణీ చేశారు. 92.69% మందికి పంపిణీ చేసినట్లు డాక్టర్ జి.మణీత్యాగి తెలిపారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ మహేశ్వరరావు వీరవాసరంలో ఉన్న డివైన్ మెర్సీ స్కూల్, పెదపేట అంగన్వాడీ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సీసీ హరివేంకటేశ్వర్లు, సీహెచ్‌ఓ దేవదాసు, జీవీవీ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ యాళ్ల మోహన్‌రావు, ఏఎన్ఎం భవాని పాల్గొన్నారు.

నులిపురుగులతో ఎదుగుదలకు ఆటంకం

ఉండి : ప్రతి ఒక్కరూ తమ కడుపులో ఉండే నులిపురుగులను నివారించుకుంటేనే మనిషి పూర్తిస్థాయిలో ఆరోగ్యంగా ఉంటాడని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ భానునాయక్ అన్నారు. ఎన్నార్పీ అగ్రహారంలోని జెడ్పీ హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ఆయన ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం మండలంలో మాత్రల పంపిణీ విధానాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తినేతిండి ఒంటపట్టాలంటే కడుపులోని నులిపురుగులను నివారించాలన్నారు. నులిపురుగులు ఉంటే మనిషి ఎదుగుదలకు తీవ్ర ఆటంకాలు కలుగుతాయన్నారు. విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని ముఖ్యంగా ఏకాగ్రత దెబ్బతింటుందని అన్నారు. బలం సన్నగిల్లి రక్తహీనత వంటి రోగాలు వస్తాయన్నారు. పీహెచ్‌సీ పరిధిలో 19 ఏళ్లలోపువారు 5,062 మంది ఉండగా మంగళవారం 96 శాతం మందికి మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.ధర్మతేజ్, సీహెచ్‌ఓ ఆర్.కృష్ణకుమార్, ఏఎన్ఎం లక్ష్మీ,ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో...

కాళ్ల : కాళ్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండలంలో 8,541 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసినట్లు పీహెచ్‌సీ డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్ తెలిపారు. మిగిలిన 643 మంది విద్యార్థులకు శనివారం లోపు మాత్రలు పంపిణీ చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సర్వ రోగాలకూ నులిపురుగే కారణం

ఆకివీడు : సర్వ రోగాలకూ నులిపురుగులే కారణమని నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు అన్నారు. స్థానిక సరోజినీనాయుడు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం.సూర్యకాంతం, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. పెదకాపవరం పీహెచ్‌సీలో నులిపురుగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్, ఎంఈఓ ఏ.రవీంద్ర పాల్గొన్నారు. వైద్యాధికారి ఎం.రమేష్ మాట్లాడుతూ ప్రతి ఆరునెలలకొకసారి నులిపురుగు నివారణ మందులు ప్రతి ఒక్కరూ వాడాలన్నారు. నీటివల్ల వచ్చే ఈ నులిపురుగుల వల్ల రక్తహీనత వస్తుందన్నారు. దుంపగడప వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ కె.సుజాత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం అర్బన్ : మండలంలోని తుందుర్రు గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని డాక్టర్ అరుణకుమారి మాట్లాడుతూ ఏడాది నుంచి 19 ఏళ్లలోపు లోపు పిల్లలు తప్పనిసరిగా నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. ఏఎన్ఎమ్ జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. రామకృష్ణంరాజు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఎన్నార్పీ అగ్రహారంలో మాత్రలు ఇస్తున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ


వీరవాసరంలో మాత్రల పంపిణీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ మహేశ్వరరావు


ఆకివీడులో విద్యార్థినికి మాత్రలు వేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

గోవు, వృషభ కల్యాణం


మేడపాడులో గోవు, వృషభానికి పెళ్లి చేస్తున్న గ్రామస్తులు

యలమంచిలి: గోవు, వృషభ కల్యాణం ..చూసిన వారికి వైభోగమనేలా మంగళవారం మేడపాడు గ్రామంలో గోవృషభ కల్యాణం నిర్వహించారు. మేడపాడు గ్రామానికి చెందిన నారిన ప్రసాద్ వృషభాన్ని అల్లారుముద్దుగా పెంచుకున్నారు. దానికి యుక్త వయస్సు రావడంతో గోవును తీసుకువచ్చి కల్యాణం చేశారు. పెనుగొండకు చెందిన వైకానస ఆగమ పండితులు గోవర్ధనం సాయి రాఘవేంద్రాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు యేడిద వికనసాచార్యులు, గోవర్ధనం మాధవాచార్యులు, పెరవలి పవన్‌కుమారచార్యులు ఈ కల్యాణం చేశారు. ఈ సందర్భంగా గోవర్ధనం సాయి రాఘవేంద్రాచార్యులు మాట్లాడుతూ లోక కల్యాణర్థం వెంకటేశ్వర స్వరూపంగా వృషభాన్ని లక్ష్మీ స్వరూపంగా గోవును భావించి గోవృషభ కల్యాణం చేస్తారన్నారు. కల్యాణానంతరం వృషభానికి శంకు, చక్రాలను అచ్చువేసి విడిచిపెట్టారు.

పోరాట ప్రదర్శనను జయప్రదం చేయాలి

పెనుగొండ: ఢిల్లీలో జరగనున్న కార్మిక, కర్షక పోరాట ప్రదర్శనను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం పిలుపు ఇచ్చారు. మంగళవారం ఏప్రిల్ 5న జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం,కౌలు రౌతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియూ సంఘాల ఆధ్వర్యంలో ఆచంటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సీఐటీయూ మండల అధ్యక్షురాలు వైట్ల ఉషారాణి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వద్దిపర్తి అంజిబాబు దాసిరెడ్డి కోటేశ్వరరావు, ఎస్‌వీఎస్ శర్మ, నిమ్మన వెంకట తాయారు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ ప్రతిష్ఠ పూజలు


వాలమర్రులో పూజలు చేస్తున్న భక్తులు

పాలకొల్లు అర్బన్: మండలంలోని వాలమర్రులో పెన్మెత్స సత్య సీతారామరాజు (మునసబు) జ్ఞాపకార్థం సుమారు రూ.2 కోట్లతో నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠలో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠలో భాగంగా గ్రామోత్సవం నిర్వహించారు. బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల బ్రహ్మత్వంలో గ్రామానికి చెందిన 12 మంది దంపతులతో ప్రత్యేకంగా నిర్మించిన యాగశాలలో పూజలు నిర్వహించారు.

అట్రాసిటీ కేసు నమోదు

ఉండి: చెరుకువాడలో కొందరిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆకివీడు మండలం ఐ.భీమవరానికి చెందిన కనుమూరి వెంకట సూర్యనారాయణరాజు అనే రైతుకు చెరుకువాడలో 7 ఎకరాల చేపల చెరువు ఉంది. దీనిని వెంప గ్రామానికి చెందిన కలిదిండి రామచంద్రరాజుకు లీజుకు ఇచ్చారు. లీజుకు తీసుకున్న రైతు చెరుకువాడ గ్రామానికి చెందిన బలం సుబ్బారావు, బలం ఆశీర్వాదం, ముస్కోడి ఏసు అనే ముగ్గురు వ్యక్తులను చెరువుపై కాపలాదారులుగా నియమించారు. చెరువు యజమానికి, లీజుదారునికి గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో చెరువు యజమాని మరో ఐదుగురితో కలసి ఇటీవల కాపాలాదారులుగా ఉన్న ముగ్గురు వ్యక్తులను చెరువు వద్ద నుండి వెళ్లిపోవాలని బెదిరించారు. వారు వినకపోవడంతో వారు కాపలాదారులను కులం పేరుతో దూషించి కొట్టారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జి ఎస్సై ఏజీఎస్ మూర్తి కేసు నమోదు చేయగా డీఎస్పీ దర్యాప్తు చేసున్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగిరపర్చాలి

అత్తిలి: జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణ లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని హౌసింగ్ ఈఈ బీవీ రమణ చెప్పారు. అత్తిలి శివారు బొంతువారిపాలెంలో జగనన్న లేఅవుట్‌లో నిర్మిస్తున్న గృహాలను మంగళవారం ఆయన పరిశీలించారు. కాలనీలో ఫోమ్ కాంక్రీట్ టెక్నాలజీతో కడుతున్న గృహాలను సందర్శించి సూచనలు చేశారు. ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, హౌసింగ్ ఏఈ టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలి

తాడేపల్లిగూడెం రూరల్: స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రతి ఆర్థిక లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని సాక్షం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తాడేపల్లిగూడెంలో సాక్షం కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు తీసుకుంటున్న రుణాలు, వాటి చెల్లింపులు, బీమా వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

25న ఎస్ఆర్‌కేఆర్‌లో స్ఫూర్తి జాతీయ సదస్సు


జాతీయ సింపోజియం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 25వ తేదీన 'స్ఫూర్తి 23' జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు చెప్పారు. మంగళవారం కళాశాలలో సింపోజియం పోస్టర్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎస్ఈ హెడ్ వి.చంద్రశేఖర్ వివరాలను వెల్లడించారు. స్ఫూర్తి సింపోజియంకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. దీనిలో భాగంగా ఈనెల 18 నుంచి మూడు రోజులపాటు అప్లికేషన్ డెవలప్‌మెంట్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 23వ తేదీన 24 గంటల పాటు నిర్విరామంగా హ్యాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సాగి సత్యప్రతీక్‌వర్మ, ప్రియదర్శిని, పి భరత్ శివవర్మ తదితరులు పాల్గొన్నారు.

కార్ల్ మార్క్స్‌కు నివాళి


కార్ల్ మార్క్స్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

సాక్షి, భీమవరం : స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కార్ల్ మార్క్స్ 140వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం కార్ల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ప్రపంచ మేధావుల్లో కార్ల మార్క్స్ ఒకరని అన్నారు. ఇదే రోజున ప్రముఖ శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ వర్ధంతని ఆయన గుర్తు చేశారు. ఈ ఇద్దరు ప్రపంచాన్ని ప్రభావితం చేసిన వారిలో ప్రధానమైన వారని, ఇది ప్రపంచ అధ్యయనాల్లో రుజువైందన్నారు. దానితోపాటుగా పెట్టుబడి గ్రంధాన్ని రచించారని అన్నారు. కార్యక్రమంలో జేఎన్‌వీ గోపాలన్, బి.వాసుదేవరావు, జె.సత్యనారాయణ, కె.క్రాంతి బాబు, ఎం.ఆంజనేయులు, అల్లూరి అరుణ్, బి.విజయ్, గంటి శ్రీను, జి.రఫాయేలు, కె.రత్నకుమారి పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు


నాన్ లేఔట్‌లో నిర్మించిన ఓ భవనం


అనుమతులు లేకుండా నిర్మించిన కాంప్లెక్స్

పాలకోడేరు : శృంగవృక్షం గ్రామంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొందరు నాన్ లేఅవుట్ స్థలంలో నివాసిత, వాణిజ్య భవనాలు నిర్మిస్తున్నారు.. ఎలాంటి పరిశీలన చేయకుండా వారికి అధికారులు విద్యుత్ కనెక్షన్లు సైతం మంజూరు చేశారు. అయితే ఈ వ్యవహారంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తుండడంతో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. సదరు యజమానులను నిర్మాణాలు ఆపాలని నోటీసులు జారీ చేస్తుండడంతో వారు గగ్గోలు పెడుతున్నారు. తొలుత సదరు యజమానులు విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా అప్పటి సెక్రటరీ దొంగ సత్యనారాయణ ఎలాంటి పరిశీలన చేయకుండానే అనుమతి ఇచ్చేశారు. దీంతో సదరు యజమాని భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే ఇటీవల ఇదే విషయమై స్థలం నాన్ లేఅవుట్‌లో ఉందని, విద్యుత్ కనెక్షన్ రద్దు చేయాలంటూ తీర్మానం చేయాలని బోర్డ్ సమావేశంలో అజెండాలో పెట్టారు. ఇప్పుడు అర్థాంతరంగా విద్యుత్ కనెక్షన్ రద్దు చేస్తే ఆ యజమాని ఎంత ఇబ్బంది పడతారని, దానికి ఎవరు బాధ్యులని పంచాయతీ వార్డ్ సభ్యురాలు సోము దుర్గా భవాని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఒత్తిళ్లకు లొంగి అధికారులు అనుమతులు ఇచ్చారని ప్రస్తుత ఇన్‌చార్జి కార్యదర్శి వెంకటరాజు బదులిచ్చారు. మరో యజమాని ఏకంగా నాలుగు వాటాలు గల కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తుంటే తమకు సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శి వెంకటరాజును ప్రశ్నించగా నోటీసులు ఇచ్చామని అయినా నిర్మాణాలు ఆపడం లేదని. కేసులు పెట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

లా నేస్తం అర్హత వయస్సు పెంచాలని వినతి

పాలకొల్లు అర్బన్: డాక్టర్ వైఎస్సార్ లా నేస్తం ద్వారా ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన జూనియర్ లాయర్లు లబ్ధి పొందేందుకు ప్రస్తుతం ఉన్న 35ఏళ్ల వయో పరిమితిని 40 ఏళ్లకు పెంచే విధంగా ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ హామీ ఇచ్చారు. పాలకొల్లు కోర్టు ఆవరణలో మంగళవారం పలువురు జూనియర్ లాయర్లు లా నేస్తం ద్వారా ఏడాదికి రూ.5 వేలు చొప్పున మూడు సంవత్సరాలకు రూ.15 వేలు జూనియర్ లాయర్లు లబ్ధి పొందుతున్నారన్నారు. అయితే ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన జూనియర్ లాయర్లకు వయోపరిమితి పెంచాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనందప్రకాష్ జూనియర్ల లాయర్ల ఉద్దేశించి మాట్లాడుతూ ఈ విషయాన్ని కమిషన్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే లాయర్ల సంక్షేమం కోసం బార్ అసోషియేషన్‌కు రూ.100 కోట్లు నిధులు విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది కుంచిలపల్లి విన్సెన్‌బాబు, బండి సుందరరామమూర్తి, వడ్లపాటి ఆనందరాజు, పారుపల్లి సుందర్‌పాల్, పాముల చిట్టిబాబు, వేదాల నాగరాజు, రావి దేవరాజు, ఆర్ ప్రభాకరరావు, కత్తుల సత్యనారాయణ, గంజి రాజు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో యాగం ప్రారంభం


వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్) : పట్టణంలోని హౌసింగ్ బోర్డులో వేంచేసియున్న శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి మందిరంలో నిర్వహిస్తున్న శ్రీవారి అష్టబంధన సంప్రోక్షణ మహోత్సవ యాగం వేదోక్తంగా ప్రారంభమయ్యింది. అర్చకులు పాణింగిపల్లి శ్రీనివాసాచార్యుల పర్యవేక్షణలో యీవని రామచంద్ర సోమయాజి ఘనాపాటి వేదోక్త మంగళాశాసనంతో వైభవంగా నిర్వహించారు. మంగళవారం దీక్షాధారణ, అగ్నిప్రతిష్ట, సాయంత్రం సకల హోమాలు నిర్వహించారు. కొత్తపల్లి కోదండ రామ గాంధీరాజు – హైమావతి దంపతులు పీటలపై కూర్చుని పూజాధికాలు చేశారు. 20 మంది అర్చకులకు దీక్షాదారణ, ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకట్రాజు దీక్షా వస్త్రాలు అందించారు. ఉదయం 4 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు లోకశాంతి కోసం ఈ యాగం నిర్వహించారు. ఈనెల 18వ తేదీ వరకు యాగం నిర్వహిస్తామని ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకట్రాజు, కుక్కల బాల తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి తాడికొండ కోటేశ్వరరావు గుప్త, ఉపాధ్యక్షుడు సరిపిడకల రామారావు, గొన్నాబత్తుల మల్లేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి, జానపాటి మధుసూదనరావు, కడలి వెంకటేశ్వరరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఆశాజనకంగా రబీ సాగు


స్థానిక ఆర్బీకే పరిధిలోని వరి పొలాల్ని సందర్శించిన కేవీకే శాస్త్రవేత్తలు

ఆకివీడు : రబీ సాగు ఆశాజనకంగా ఉందని కేవీకే శాస్త్రవేత్తలు వినయలక్ష్మి, రాజేష్ చెప్పారు. మండలంలోని మాదివాడ, ఆకివీడు ప్రాంతాల్లోని వరి సాగును మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడక్కడా కాండం కుళ్లు తెగులు ఉందని గుర్తించారు. డెల్టా శివారు, కొల్లేరు తీరంలోని ఉన్న గ్రామాల్లో వరి పొట్ట, ఈనిక దశలో ఉందన్నారు. తెగుళ్ల ప్రభావంకు పంట దూరంగా ఉందని చెప్పారు. ఏడీఏ కేఎస్ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ కాండం కుళ్లు తెగుళ్ల నివారణకు టెబుకొనజోల్ 2 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయాధికారిణి ఎమ్మార్పీ ప్రియాంక, వీఏఏ సతీష్, నరేంద్ర, రైతులు పాల్గొన్నారు. అనంతరం కాండం కుళ్లు నివారణకు మందును శాస్త్రవేత్త రాజేష్ రైతుకు అందజేశారు.

ఆర్‌బీకేల్లో ఈ క్రాప్ జాబితాలు

పోడూరు: మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో 2022–23 రబీ సీజన్‌కు సంబంధించిన ఈ క్రాప్ ముసాయిదా వివరాలను రైతులకు అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో ఈ నెల 17 వరకు ముసాయిదా వివరాల జాబితా అందుబాటులో ఉంటుందనీ, రైతులకు అభ్యంతరాలు ఉన్నా, సవరణలు ఉన్నా గ్రామ వ్యవసాయ సహాయకులకు రాత పూర్వకంగా తెలియపర్చాలని వ్యవసాయాధికారి సూచించారు. మండలవ్యాప్తంగా 6,791 మంది రైతులకు సంబంధించి 13,530 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

లేగదూడల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ


లేగదూడల ప్రదర్శనలో మొదటి బహుమతిని అందిస్తున్న సర్పంచ్ మరియు అధికారులు

మొగల్తూరు: ప్రస్తుతం ఉన్న పెయ్య దూడలే రేపటి పాడిపశువులుగా గుర్తించి రైతులు లేగదూడల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జవాన్ హుస్సేన్ సూచించారు. మంగళవారం స్థానిక వెటర్నరీ ఆసుపత్రి ప్రాంగణంలో లేగదూడల ప్రదర్శన, దూడల పెంపకంపై ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. పెయ్య దూడలను శాస్త్రీయ పద్ధతిలో పోషిస్తే వాటిని మంచి పాడి పశువులుగా అభివృద్ధి చేసుకోవచ్చున్నారు. లేగదూడల ప్రదర్శనలో పలు గ్రామాలకు చెందిన 24 లేగదూడలను ప్రదర్శనలో ఉంచారు. మొదటి బహుమతిగా దారితిప్పకు చెందిన రైతు సరిపల్లి సుబ్బరాజు పోషిస్తున్న సాహివాల్ జాతికి చెందిన లేగదూడకు దక్కగా, రెండో బహుమతి రామన్నపాలేనికి చెందిన రైతు అయితం చందు పోషిస్తున్న పుంగనూరు జాతికి చెందిన లేడదూడకు, మూడో బహుమతి మొగల్తూరుకు చెందిన రైతు రావూరి సత్యనారాయణ పోషిస్తున్న లేగదూడకు దక్కింది. ఎంబీసీ చైర్మన్ పెంద్ర వీరన్న, సర్పంచ్ పడవల మేరీ, పశుసంవర్థక శాక ఏడీ డాక్టర్ సుధాకర్, ఈవో డాక్టర్ జేసురత్నం, వెటర్నరీ డాక్టర్లు నీలిమ, సురేంద్ర, నాయకులు పడవల సత్యనారాయణ, పెంకే చంటి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకోడేరు : విద్యుత్ లైన్లు 11 కే.వీ. మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉయదం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. పెన్నాడ, శృంగవృక్షం, విస్సాకోడేరు, వంకాయలపాలెం, గొరగనమూడి, గొరగనమూడి పాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రైవేటు పాఠశాలలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

ఉండి : రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలపై ప్రత్యేక దృష్టిసారించాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. మంగళవారం ఉండిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీ నియమించి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. సెలవుదినాల్లో తరగతులు నిర్వహిస్తూ, ఉపాధ్యాయులతో పనిచేయించుకుంటున్న వారిపై విద్యాశాఖాధికారులు తగు విధంగా స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా ఒన్నల వజ్రంకు నియామకపత్రాన్ని అందజేశారు. నాయకులు సంధి జయరాజు, నేతల సువర్ణరాజు, చిగురుపాటి రాజేష్, నన్నేటి నాగరాజు, కోలాటి ప్రసాదరావు, చిల్లే రాజ్‌కుమార్, నేతల సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

ఉండి : ఎన్నార్పీ అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాతలు పి.నరసింగరావు, కన్నెగంటి రూత్‌కళ, హరనాథరాజు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గొట్టుముక్కల రాము, కలిదిండి సీతారామరాజు మాట్లాడుతూ చదువును నిర్లక్ష్యం చేయవద్దని, భవిష్యత్‌లో అభివృద్ధి సాధించాలంటే ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రతి ఒక్కరూ పోటీపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో పి రంగప్రసాద్‌రాజు, హెచ్ఎం ఎంవీ సత్యనారాయణ, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

యోగాలో చిన్నారి ప్రతిభ


ఢిల్లీ యోగా మహోత్సవ్‌లో జ్ఞాపికను అందుకుంటున్న నాగ నిహాల్

పెనుగొండ: పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు నాలుగేళ్ల చిన్నోడు చేసిన యోగా ప్రదర్శన దేశవిదేశాల ప్రతినిధులు కరతాళ ధ్వనులను అందుకుంది. పెనుగొండకు చెందిన ఆసు బసవరాజు, మాధవిలన తనయుడు నాగనిహాల్ ఈ ఘనతను సాధించాడు. ఇంటర్నేషనల్ యోగా డే సందర్భంగా న్యూఢిల్లీలో మంగళవారం నిర్వహించిన యోగా మహోత్సవ్‌లో పెనుగొండకు చెందిన ఆసు నాగనిహాల్ పాల్గొన్నాడు. దీనిలో శబ్ద భేరీ యోగాలో ప్రదర్శించిన ప్రదర్శన పలువురును విస్మయ పరిచింది. కళ్లకు గంతలు కట్టుకొని నిర్వాహకులు చూపిన అంకెలు, రంగులు, ఇతర వస్తువులను కరక్ట్‌గా చేప్పడంతో పాటు, గంతలతోనే సైకిల్ తొక్కడం వంటి ప్రదర్శనలతో ఆకట్టుకున్నాడు. అనంతరం నాగనిహాల్‌ను జ్ఞాపికతో సత్కరించారు. ఆన్‌లైన్ యోగా క్లాసుల్లో అంతర్జాతీయ యోగా గురువు పిడుగు హరిదాసు శ్రీనివాసు నుంచి శబ్దభేరి యోగా శిక్షణ పొందినట్లు తల్లిదండ్రులు ఆసు బసవరాజు, మాధవి తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఉండి : బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఎన్నార్పీ అగ్రహారానికి చెందిన చించర్లపూడి వెంకటేష్ వరుసకు సోదరి అయిన 15 ఏళ్ల బాలికపై సోమవారం రాత్రి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు.